## క్లుప్తంగా

### నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

రాజేంద్రనగర్: టీజీ ఆర్టీసీ రాజేంద్రనగర్ డిపో పరిధిలో ప్రయాణికులకు మెరుగైన సేవలు, సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా సోమవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రాజేంద్రనగర్ డిపో మేనేజర్ బద్రీనారాయణ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు, కాలనీవాసులు పాల్గొని తమ విలువైన సలహాలు, సూచనలు, ఫిర్యాదులు చేయాలని డీఎం సూచించారు. ఆర్టీసీ బస్సులు ప్రయాణికులు తమ ఫిర్యాదులను ఫోన్: 99592 26135లో తెలియజేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

### పీస్ కమిటీ సభ్యులు క్రియాశీలకంగా ఉండాలి



గోల్కొండ ఏసీపీతో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు

గోల్కొండ: పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు క్రియాశీలకంగా ఉండాలని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. ఆదివారం పలువురు పీస్ కమిటీ సభ్యులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. నామ్‌కే వాస్తేగా కమిటీలో ఉన్న వారు ఇక నుంచి పని చేయకపోతే సభ్యత్వాన్ని రద్దు చేస్తామన్నారు. అదే విధంగా పోలీస్‌స్టేషన్‌లలో పరవీలు చేసే పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు కూడా తమ పద్ధతిని మార్చుకోవాలని సూచించారు. స్థానికంగా శాంతిభద్రతలను పరిరక్షించడం, వివిధ వర్గాల పండుగలను శాంతియుతంగా జరిగేలా పోలీసులకు సహకరించడం పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల పని అని ఆయన పేర్కొన్నారు. అయితే పలువురు పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు సమావేశాలకు హాజరు కావడం లేదని అటువంటి వారు స్వచ్ఛందంగా కమిటీల నుంచి వైదొలగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మిర్జా ఎక్బాల్ అహ్మద్, ఆబిద్, ఖైరుద్దీన్, అజామ్‌ఖాన్, ఇలియాస్ ఆలీ తదితరులున్నారు.

### ఫుట్‌పాత్‌లపై ఈవీ చార్జింగ్ స్టేషన్‌లు



టోలిచౌకీ వద్ద..

గోల్కొండ: ఎలక్ట్రానిక్ వాహనాల సౌలభ్యం కోసం పలు ప్రాంతాల్లో చార్జింగ్ స్టేషన్‌లు ఏర్పాటు అయ్యాయి. మెహిదీపట్నం–టోలిచౌకీ మెయిన్ రోడ్డు, గోల్కొండ బంజారా దర్వాజ తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై ఈవీ చార్జింగ్ మిషిన్‌లు ఏర్పాటు కావడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టోలిచౌకీ సమీపంలో ఫుట్‌పాత్‌ను పూర్తిగా తొలగించి ఓ చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. దీనిపై పాదచారులు, మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా కమర్షియల్ విధానంలో ఏర్పాటు అవుతున్న ఈవీ చార్జింగ్ సెంటర్లు ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేయడం సమంజసమేనా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

### 6, 7 తేదీల్లో తాండ్ర కుమార్ స్మారక క్రికెట్ పోటీలు

మియాపూర్: ఏఐఎఫ్‌డీఎస్ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో జనవరి 6, 7 తేదీల్లో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం గ్రేటర్ కమిటీ కన్వీనర్ తెలిపారు. ఆదివారం కమిటీ సభ్యులతో కలిసి తాండ్ర కుమార్ మెమోరియల్ క్రికెట్ పోటీల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండ్ర కుమార్ మెమోరియల్ క్రికెట్ పోటీలు చందానగర్ పీజేఆర్ స్టేడియంలో జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ క్రికెట్ పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

శేరిలింగంపల్లి: పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ వరమని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. నల్లగండ్లలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మదీనాగూడకు చెందిన కీర్తనకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ. 1.20 లక్షల మంజూరు పత్రాలను జగదీశ్వర్‌గౌడ్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ... పేదలకు వైద్యసేవలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కాంగ్రెస్ నాయకులు షేక్ ఖాజీ, ముస్తాఫా, భిక్షపతి, రత్నాకర్ రెడ్డి, కృష్ణ, విష్ణు పాల్గొన్నారు.

# భళారే విచిత్రం!

## చైతన్య స్ఫూర్తితో వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు

- సందేశాత్మక చిత్రాలతో సత్తాచాటిన విద్యార్థులు




విద్యార్థులు రూపొందించిన చిత్రాలు

అత్తాపూర్: ఆ విద్యార్థుల్లో కాబోయే శాస్త్రవేత్తలు కనిపించారు. పర్యావరణం పరికాలాలపాటు పదిలంగా ఉండాలంటే వన్యప్రాణులు, పక్షుల ఉనికి పూర్తిగా కోల్పోకుండా అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందంటూ విద్యార్థులు తమ ఆలోచనలతో చాటిచెప్పారు. దేశానికి వెన్నుముక రైతన్న అని చెప్పకనే గుర్తు చేస్తూ మానవాళికి ఆహారం అందిస్తున్న వ్యవసాయం పట్ల అక్కడి పాఠశాల స్థాయి విద్యార్థుల్లో చైతన్యం వెల్లువెత్తిందనే చెప్పాలి. ఆదివారం రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో అత్తాపూర్ రాంబాగ్‌లోని హైదరాబాద్ స్కాట్స్ హై స్కూల్ ఆవరణలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 1000 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థినీవిద్యార్థులకు నిర్వాహకులు వ్యాసరచన, డ్రాయింగ్‌లలో పోటీలను నిర్వహించారు. ఆయా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు పర్యావరణంలో వస్తున్న మార్పుల వల్ల కలుగుతున్న నష్టాలను కళ్లకు కట్టినట్లు తమ చిత్ర లేఖనంతో ఉదహరించారు. వ్యవసాయం ప్రాముఖ్యత ఏమిటి, భూమి సారవంతంగా ఉంటే ఎలాంటి లాభాలు ఉంటాయి. గ్లోబల్ వార్మింగ్ కారణంగా ఎదుర్కొంటున్న, ఎదురవుతున్న సమస్యలను వివరిస్తూ వారు గీసిన చిత్రాల నమూనాలు చూపరులను ఆలోచింపజేశాయి.



- ప్లాస్టిక్ వినియోగం వల్ల ఉత్పన్నమవుతున్న సమస్యలు, ప్లాస్టిక్ రీ సైక్లింగ్ అవశ్యతను విద్యార్థులు చిత్ర లేఖనం, వ్యాస రచనల ద్వారా వివరించారు.



చిత్రం గీస్తున్న విద్యార్థిని



హైదరాబాద్ స్కాట్స్ స్కూల్‌లో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

- రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు ఎం.ప్రభాకరాచారి, ప్రధాన కార్యదర్శి జి.శరవణ్‌కుమార్, కోశాధికారి ఎస్.ఆర్.రజనీకాంత్, క్రీడా, సంస్కృతిక విభాగాల కార్యదర్శులు వేణుగోపాల్, బోయ లక్ష్మణ్, హైదరాబాద్ స్కాట్స్ స్కూల్ అధినేత జి.జగన్నాథం, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు కరుణాకర్, రాజేంద్రప్రసాద్, భాస్కర్, సందీప్, వాజీద్, శేషు, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆర్డీఓ కార్యాలయంలో ప్రజావాణి

రాజేంద్రనగర్: అత్తాపూర్‌లోని రాజేంద్రనగర్ ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ప్రతి సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజావాణి నిర్వహించనున్నామన్నారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతులు, ఫిర్యాదులు, ఇతరాత్ర అర్జీలు, దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

### రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో...

రాజేంద్రనగర్: జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి అందుబాటులో ఉంటుందన్నారు. అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్ డివిజన్ల పరిధిలోని ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. జీహెచ్‌ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

## సగర సంఘం నూతన కార్యవర్గం



కార్యవర్గ సభ్యులు

మణికొండ: సగర (ఉప్పర) సంఘం మణికొండ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. మణికొండలోని సంఘం కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు మహేదేవ్‌సాగర్ తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా ఆర్.వెంకటేశ్ సాగర్, డి.హనుమంతుసాగర్, జి.దేవేందర్, అధ్యక్షుడిగా జి.వెంకటస్వామి సాగర్, ప్రధాన కార్యదర్శులుగా జి.గోపాల్‌సాగర్, వి.కృష్ణసాగర్, కోశాధికారులుగా పి.కృష్ణయ్య, ఎ.నాగేశ్వర్‌సాగర్, ఉపాధ్యక్షులుగా కె.అశోక్‌సాగర్, ఆర్.నర్సింహులు సాగర్, జి.కృష్ణసాగర్‌లను ఎన్నుకున్నట్లు ఆయన వివరించారు. వీరితో పాటు గౌరవ సలహాదారులుగా కాశన్నసాగర్, ఎ.నాగరాజు సాగర్, బుచ్చన్న సాగర్, ఎ.వెంకటస్వామిసాగర్, సంయుక్త కార్యదర్శులుగా వి.అశోక్‌సాగర్, కె.రఘుపతిసాగర్, కె.బాలకృష్ణసాగర్, ఎస్.వెంకటేష్‌సాగర్,. కె.శేఖర్‌సాగర్, నాగరాజు సాగర్, జి.రవిసాగర్, ఆర్.బాలరాజు, బి.నర్సింహాసాగర్, ప్రచార కార్యదర్శులుగా కె.గిరిసార్, జి.రాజుసాగర్, విష్ణు, ఆర్.రమణ, బి.యాదయ్యలను ఎన్నుకున్నట్టు తెలిపారు. కార్యవర్గానికి పదవీకాలం రెండేళ్ల పాటు ఉంటుందన్నారు.

## 'తెలంగాణలో ప్రజా వ్యతిరేక పాలన'



మాట్లాడుతున్న దేవర శ్రీనివాస్

గోల్కొండ: తెలంగాణలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గుడిమల్కాపూర్‌లో బీజేపీ నాయకులతో కలిసి ఆయన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, బడుగు వర్గాల ప్రజలతో పాటు రైతాంగాన్ని కూడా సీఎం రేవంత్‌రెడ్డి మోసపూరిత ప్రకటనలతో పాలన కొనసాగిస్తున్నారన్నారు. సమగ్ర కుటుంబ సర్వే, ఇందిరమ్మ లబ్ధిదారుల కోసం చేపట్టిన సర్వేలన్ని బూటకాలే అని ఆయన ఆరోపించారు. ఏదేమైనా రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొని ఉందని ఆయన అన్నారు.

## హైదర్‌గూడలో 'ప్రేమ విందు'



పాస్టర్ రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలో క్రిస్మస్ పర్వదినం, న్యూ ఇయర్ వేడుకలను పురస్కరించుకొని ప్రేమ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదర్‌గూడ డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాల్‌లో అగాపే ప్రేయర్ టెంపుల్ పాస్టర్ రాజ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీత గౌరీశంకర్, వనం, శ్రీరామ్‌రెడ్డి, సోమారం రాజ్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాస్టర్లు తమ దైవ సందేశాన్ని వివిపించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పాస్టర్ రెవరెండ్ కె.నథానియల్, పాస్టర్ పాల్ పరమేష్, పాస్టర్ శ్యామ్యూల్‌రాజ్, పాస్టర్ జోనతన్ తదితరులు పాల్గొన్నారు.

## ఈబీసీ రెడ్డి విద్యార్థుల ఉన్నత విద్యకు స్కాలర్‌షిప్



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న భూపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి

అత్తాపూర్: ఈబీసీ రెడ్డి విద్యార్థుల ఉన్నత చదువుల కోసం రెడ్డి సంఘం అత్తాపూర్ సొసైటీ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని సొసైటీ అధ్యక్షుడు గుమ్మడి భూపాల్‌రెడ్డి, కార్యదర్శి మంగళారం గోవర్ధన్‌రెడ్డిలు తెలిపారు. రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆర్థిక సమస్యలతో ఇతర దేశాలలో ఉన్నత చదువులు చదవలేక ఉన్న కుటుంబాల విద్యార్థులకు చేయూత ఇస్తామన్నారు. ఎవరో వస్తారు ఏదో చేస్తారు అని ఎదురు చూడకుండా మెరిట్ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో ఉన్నత విద్యాభ్యాసం చేసేవారు, ఇతర దేశాల్లో చదువుకునే వారికి మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేస్తామని వారు వివరించారు. పేదరికం అడ్డు రాకూండా చూడాలన్న లక్ష్యంతో రెడ్డి సంఘం అత్తాపూర్ సొసైటీ కృషి చేస్తుందన్నారు. వివరాలకు ఫోన్స్: 90326 53330, 99495 03350లలో సంప్రదించాలని కోరారు. నేతలు బద్దం జీవిత్‌రెడ్డి, మిద్దల రామ్‌రెడ్డి, బి.రాజారెడ్డి, ఇంద్రసేనరెడ్డి, పాశం మధుసుధన్‌రెడ్డి, పి.సుధాకర్ రెడ్డి, పి.రాజశేఖర్‌రెడ్డి, పన్నాల విరాజున్‌రెడ్డి, బి.జనార్ధన్‌రెడ్డి, సూర్యలక్ష్మణ్‌రెడ్డి, గుమ్మడి శ్రీకాంత్‌రెడ్డి, కొత్తకాపు చెన్నారెడ్డి, మేకల శ్యామ్‌సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: విద్యుత్ వైర్లకు సమీపంలోని చెట్ల కొమ్మలను తొలగించటం, మెయింటెనెన్స్ పనులను చేపడుతున్నందున సోమవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మణికొండ సబ్‌స్టేషన్ పరిధిలోని కేపీఆర్ కాలనీ, మణికొండ గార్డన్, సుందర్‌గార్డన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఏరియా, పోచమ్మ కాలనీ, నేతాజీకాలనీలలో విద్యుత్ ఉండదని తెలిపారు. ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు పుప్పాలగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని మారుతీనగర్, పుప్పాలగూడ గ్రామం, మారుతీనగర్, దుర్గానగర్, రవీంద్ర కాలనీ, గోల్డెన్ ఓరియన్, మానస అపార్ట్‌మెంట్స్, ఎల్‌ఐసీ కాలనీలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఏఈ వివరించారు.

### కిస్మత్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో...

బండ్లగూడ: కిస్మత్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ ఎ.మల్లేష్‌రాజ్ తెలిపారు. డిఫెన్స్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆర్.వి.నిర్మన్, ట్రంప్ విల్లాస్, సాయిబాబాకాలనీ, డిఫెన్స్ కాలనీ, రామ్‌కీ విల్లాస్, కూడర్ ఎన్‌ఆర్‌ఐ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

## గాస్పెల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న పాస్టర్ రెవరెండ్ జాన్ మోజెస్ తదితరులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మన్నాపుల్ గాస్పెల్ చర్చిలో డిసెంబర్ నెలలో వచ్చే చివరి ఆదివారం సందర్భంగా చర్చి పాస్టర్ రెవరెండ్ సి.హెచ్.జాన్ మోజెస్ నేతృత్వంలో మెన్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే ప్రత్యేక ఆరాధనలు వినిపించారు. ఆరాధనలకు బ్రదర్ డానియల్ అధ్యక్షతన వహించగా డి.సాయిలు బృందం పాటలు పడి వినిపించారు. బ్రదర్ సి.హెచ్.జాన్ కీర్తనలు చదివారు. బ్రదర్ నాని సాక్ష్యం చెప్పి దేవుని మహిమ వివరించారు. బ్రదర్ డ్యానీ ప్రార్థన చేశారు. బైబిల్ సందేశాలను బ్రదర్ పాల జోబ్ వినిపించారు. క్రైస్తవ జీవితంలో శ్రమలు వస్తాయని.. వాటిని ఎదుర్కొని దేవుని ఆశీర్వాదాలు పొందాలని పిలుపునిచ్చారు. దేవుని రాజ్యాన్ని సంపాదించుకోవాలంటే ప్రతిదినం వాక్యం చదవాలని.. సహనం కలిగి జీవించాలని సూచించారు. క్రైస్తవులు మంచి సాక్ష్యాన్ని కలిగి ఉండాలన్నారు. ప్రార్థనల్లో బ్రదర్ జాన్, బ్రదర్ డి.గిరిదాస్, బ్రదర్ నాని, బ్రదర్ డ్యానీ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ హోర్డింగులతో 'ఖజానా'కు గండి

- ఔటర్‌కు ఇరువైపులా నిషేధించి ఏడాది గడిచినా అదే తీరు
- గతంలో తొలగించిన ఏజెన్సీలు
- ప్రస్తుతం జోరుగా ప్రకటనలు
- ప్రకటనల నుంచి పైసా రాలని వైనం!



ఔటర్ పక్కన అక్రమంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్

శంషాబాద్: వాటి నుంచి పైసా కూడా పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం లభించడం లేదు. అయినా వారు మాత్రం ప్రకటనదారుల పైసలు రాబడుతున్నారు. ప్రభుత్వానికి నయాపైసా చెల్లించకుండా హోర్డింగ్ ఏజెన్సీలు ప్రకటనల రూపంలో లక్షలాది రూపాయల ఆదాయాన్ని పొందుతున్నా స్థానిక సంస్థలు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- సుమారు ఏడాదిన్నర క్రితం అప్పటి ప్రభుత్వం ఔటర్ రింగురోడ్డుకు ఇరువైపులా ఎలాంటి హోర్డింగ్‌లు ఏర్పాటు చేయొద్దని నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అప్పట్లో కొన్ని ఏజెన్సీలు హోర్డింగ్‌లు తొలగించాయి. మరికొన్ని సంస్థలు హోర్డింగ్‌లను తొలగించకుండా వాటిపై వేసే ప్రకటనలు నిలిపివేశాయి. వాటిని పూర్తిగా నిషేధించే ఉద్దేశంతో వాటి ద్వారా స్థానిక సంస్థలకు వచ్చే పన్నులు కూడా నిలిపివేశారు.
- రాష్ట్ర ప్రభుత్వం మారినా ఆయా ప్రకటలనపై ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. హోర్డింగ్‌లు తొలగించాలా..? ఉండాలా అనే విషయం ఇప్పటికీ అగమ్యగోచరంగా తయారైంది. వాటి నుంచి పన్ను వసూలు తీసుకోవాలనే స్పష్టమైన ఆదేశాలు కూడా లేవు.
- ఇదిలా ఉండగా సంబంధిత హోర్డింగ్‌లకు సంబంధించి పన్నులను వసూలు మాత్రం చేయడం లేదని శంషాబాద్ మున్సిపాలిటీ సంబంధిత విభాగానికి చెందిన ఓ అధికారి 'సాక్షి'కి తెలిపారు.
- ఇకనైనా ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### కొత్త పాలసీ వస్తేనే...

ప్రభుత్వం యాడ్స్‌కు సంబంధించిన కొత్త పాలసీని విడుదల చేయకపోవడంతో హోర్డింగ్‌లకు సంబంధించి ఎలాంటి రెన్యువల్ చేయడంలేదు. ఔటర్ సర్వీసు పక్కన ఉన్న హోర్డింగ్‌లకు సంబంధించిన వాటి గురించి కూడా ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వాటిపై చర్యలు తీసుకుంటాం.

– బి.సుమన్‌రావు, శంషాబాద్ మున్సిపల్ కమిషర్

## ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

గోల్కొండ: ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.సుధాకర్‌తో కలిసి టోలిచౌకీ చౌరస్తా సెవన్ టూంబ్స్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అక్రమ పార్కింగ్‌లు తదితర విషయాలపై ట్రాఫిక్ పోలీసులతో చర్చించారు. అనంతరం ఆయన సెవన్ టూంబ్స్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ రోటరీని పరిశీలించారు. సెవన్ టూంబ్స్ చౌరస్తా నుంచి బంజారి దర్వాజా వరకు ట్రాఫిక్ నివారించడానికి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామని ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వివరించారు. సెవన్ టూంబ్స్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన రోటరీ ఎత్తు పెరిగిందని దీనిని తగ్గించాల్సిన అవసరం ఉందని ఆయన ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ, రోటరీల ఏర్పాటు తదితర విషయాలు ట్రాఫిక్ అధికారులపై ఉందని అన్నారు. ఏదేమైనా కూడా సెవన్ టూంబ్స్ నుంచి బంజారి దర్వాజా మీదుగా ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతుందన్నారు. ముఖ్యంగా బంజారి దర్వాజ వద్ద రాత్రి 12 వరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందన్నారు. ఇక్కడ ట్రాఫిక్‌ను తగ్గించడానికి తాము సెవన్ టూంబ్స్ నుంచి గోల్కొండ రేషం బాగ్ వరకు దీనికి సంబంధించిన జాయింట్ సర్వే కూడా పూర్తి అయిందని ఆయన అన్నారు.